

తీగబారిన తీర్థాలు..
మకర సంక్రాంతి రోజు ఐనవోలు, కొత్తకొండ, ఆలేటి ఎల్లవ్వ జాతరలకు లక్షలాది మంది హాజరయ్యారు. డప్పు చప్పుళ్లు, శివసత్తులు పూనకాల మధ్య చేరుకున్నారు. - 8లో



జల్సాలకు అలవాటుపడి.. చోరీలు
జల్సాలకు అలవాటుపడి.. నగదు కోసం పలు ఏటీఎంలలో చోరీకి యత్నించి, వాటిని ధ్వంసం చేసిన సంఘటన నర్సంపేట పట్టణంలో చోటు చేసుకుంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
$33.7^0 / 18.2^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు కాస్త మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వ్యయాలపై సమగ్ర విచారణ జరగాలి



దోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పాలకవర్గం ఎన్నికై న నాటి నుంచి చేసిన వ్యయాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో ఎజెండా అంశాలపై సమీక్ష జరిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తాము చేసిన కొన్ని పనులకు సంబంధించి ఎంబీలు, రికార్డులు కార్యాలయంలో మాయంకావడంతో తమకు బిల్లులు చెల్లించలేదన్నారు. 2021లో బోరు పరికరాల కోసం పాలకవర్గం అనుమతి లేకుండా రూ.2.89 చెల్లించారని సభ్యులు ఆరోపించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన కమిషనర్లు అవినీతికి పాల్పడి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో విధులు నిర్వహించిన కమిషనర్ల హయాంలో జరిగిన ఖర్చులపై విచారణ జరపాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు పనులకు అవసరానికంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేసినట్లు తెలిసిందన్నారు. నిధుల దుర్వినియోగం విషయాన్ని కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కమిషనర్ మున్వర్ అలీ పాల్గొన్నారు.

యువకుడిపై దాడి



పెద్దవంగర: యువకుడిపై కత్తులతో పలువురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండల పరిధిలోని కొరిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన తుమ్మ దీపక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో అత్తగారి గ్రామమైన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని కొరిపల్లి గ్రామానికి సంక్రాంతి పండగకు వచ్చాడు. ఇదే గ్రామంలో తన సోదరిని డోనాల రత్నాకర్ రెడ్డికి ఇచ్చి వివాహం చేశాడు. సోమవారం రాత్రి సోదరి ఇంట్లో భోజనం చేసి అత్తగారి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన సాకి రాములు, సాకి యాకయ్యతో పాటు అతడి కుమారులు సాయికుమార్, మహేష్ పాత కక్షలతో దీపక్‌రెడ్డిపై కత్తులు, కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన అతడు తప్పించుకొని అత్తగారి ఇంటికి వస్తుండగా స్పృహ తప్పి సమీపంలో పడిపోయాడు. గమనించిన అతడి భార్య, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హనుమకొండని ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య తుమ్మ మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మేడారం రోడ్డు, పార్కింగ్ స్థలాల పరిశీలన

ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం మహాజాతరకు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే రోడ్డు మార్గాన్ని ఎస్పీ శబరీష్ మంగళవారం పరిశీలించారు. ఏటూరునాగారం మండల పరిధిలోని చిన్నబోయినపల్లి నుంచి ఊరట్టం వరకు ఉన్న రోడ్డు, కల్వర్టులు, కాజ్‌వేలు, అసంపూర్తి కల్వర్టులను పరిశీలించారు. ప్రైవేట్ వాహనాలు వెళ్లే దారిలో ఉన్న కొండాయి బ్రిడ్జి తాత్కాలిక రోడ్డు, మల్యాల, కొండ్రెడు వద్ద ఉన్న పైపు కల్వర్టులు పరిశీలించారు. ప్రైవేట్ వాహనాల్లో మేడారం చేరుకునేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకరమైన మూల మలుపుల వద్ద వెంటనే గుర్తులు వేయించాలన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజలతో సమన్వయం చేసుకొని జాతరకు వెళ్లేవారికి సహాయంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా ఎస్ఎస్‌తాడ్వాయి మండల పరిధిలోని ఊరట్టం నుంచి కాల్వపల్లి వరకు ఉన్న రోడ్లను ఎస్పీ పరిశీలించారు. అనంతరం మేడారంలోని భక్తుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏఎస్పీ సంకీర్త్, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు ఉన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి!

ప్రజాపాలన దరఖాస్తుల సంఖ్యలో తేడా

- తలనొప్పిగా మారిన వ్యవహారం
- ప్రభుత్వ ఆదేశాల అనంతరం వెరిఫికేషన్
- సాధారణ అర్జీలపై రాని స్పష్టత



ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీ పథకాల అమలుకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టింది. దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేశారు. తర్వాత వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత వెరిఫికేషన్ చేస్తామని అధికారులు తెలిపారు. కాగా రాబోయే ఎన్నికల దృష్ట్యా కోడ్ రాకముందే హామీల అమలు కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాగా జిల్లాలో డిసెంబర్ 28నుంచి ఈఏడాది జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. 2,44,506 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కాగా జనరల్ కౌంటర్లలో 65,114 దరఖాస్తులు తీసుకున్నారు. మొత్తంగా 3,09,620 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. కాగా సుమారు 800 మంది ఆపరేటర్లతో ఈనెల 13వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టరేట్ ఈడీఎం ప్రశాంత్ తెలిపారు.

దరఖాస్తుల్లో తేడా..

జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తులు 2,44,506 రాగా.. ఆన్‌లైన్‌లో మాత్రం లెక్క తేడా వస్తోంది. అయితే ఇప్పటి వరకు 2,44,506 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశామని, మరికొన్ని చేయాల్సి ఉందని, మరో రెండు రోజుల్లో పూర్తి చేస్తామని ఈడీఎం ప్రశాంత్ చెబుతున్నారు. టెక్నికల్, సర్వర్ సమస్యలతో కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఆయన చెప్పిన విధంగా చూస్తే దరఖాస్తుల సంఖ్య పెరుగుతుంది. కాగా కరెంట్ పోయి వచ్చిన సందర్భాల్లో ఒకే దరఖాస్తును రెండుసార్లు ఆన్‌లైన్ చేసినట్లు కొంతమంది అధికారులు చెబుతున్నారు. కార్యక్రమ నోడల్ అధికారులుగా పని చేసిన జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ, జెడ్పీ సీఈఓ రమాదేవి 2,44,506 దరఖాస్తులే వచ్చాయని, సంఖ్య పెరిగే అవకాశం లేదని అంటున్నారు. కాగా పూర్తి స్పష్టత రావడానికి రెండు రోజులు సమయం పడుతుందని ఈడీఎం ప్రశాంత్ తెలిపారు.

స్పష్టత కరువు...

జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇతర సమస్యలపై ఏర్పాటు చేసిన జనరల్ కౌంటర్లలో 65,114 దరఖాస్తులు వచ్చాయి. వాటిపై ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు తెలిపారు. కేవలం అభయహస్తం ఐదు గ్యారంటీల దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్ చేశారు. ఇతర దరఖాస్తుల విషయంలో రిజిస్టర్‌లో నమోదు చేయాలా లేదా.. వాటిని కూడా ఆన్‌లైన్ చేయాలని ఆదేశాలు వస్తాయా అనే దాని కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

వెరిఫికేషన్ చేస్తే..

ఇంటింటి వెరిఫికేషన్ చేస్తే ముందుగా బయటపడేది రేషన్‌కార్డుల విషయమే. కొంత మంది ఆర్థికంగా ఉన్నవారు కార్డులు పొందారు. వాటితో అన్ని రకాలుగా లబ్ధిపొందుతున్నారు. అలాంటి వారి కార్డులను ముందుగా తొలగించే అవకాశం ఉంది. కాగా కేవలం అర్హులకు మాత్రమే ఐదు గ్యారంటీ పథకాలు అమలు అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: జిల్లాలోని గంగారం మండలంలో నీతి ఆయోగ్ కార్యక్రమానికి పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నీతి ఆయోగ్ ఏడు అంశాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతాయన్నారు. మండల సమావేశాలు నిర్వహిస్తూ నివేదికలు అందజేయాలన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లల ఆరోగ్య పరిస్థితులపై దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, మరుగుదొడ్లు, నీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, సీపీఓ సుబ్బారావు, డిప్యూటీ సీఈఓ నర్మద, డీఈఓ రామారావు, జిల్లా ఉద్యానవన అధికారి సూర్యనారాయణ, గంగారం ఎంపీడీఓ అపర్ణ, అధికారులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనపై దృష్టిసారించాలి

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం విద్యావ్యవస్థ పటిష్టతకు కృషి చేస్తున్న పలు సంక్షేమ శాఖల పని తీరుపై అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాప్రగతిని పెంచేందుకు పాఠశాలల్లో సౌకర్యాలపై దృష్టిపెట్టాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. జిల్లా ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు పాఠశాలల వసతి గృహాలను సందర్శించి తనిఖీ చేయాలన్నారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటితో ముగియనున్న గడువు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి బీఈడీ సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షల (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఫీజు చెల్లించేందుకు అపరాధ రుసుము రూ.250తో ఈనెల 17 వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. అపరాధ రుసుము లేకుండా పరీక్షఫీజు చెల్లించేందుకు ఈనెల 12న గడువు ముగిసిందన్నారు.

బీపీఈడీ సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజుకు గడువు

కేయూ పరిధి బీపీఈడీ సెకండియర్ మొదటి సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 17 వరకు చెల్లించేందుకు గడువు ఉందని మల్లారెడ్డి, రాధిక పేర్కొన్నారు.

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

- బయటనుంచి సిలిండర్ల కొనుగోలు
- యంత్రాలు తుప్పుపట్టే అవకాశం



నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్

నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. రెండేళ్ల క్రితం కరోనా కష్టకాలంలో పీఎం కేర్ ఆధ్వర్యంలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం, ఆక్సిజన్ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు. అయితే ప్రస్తుతం వినియోగించకపోవడంతో మిషన్లు తుప్పుపట్టి పాడయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు దృష్టిసారించి వినియోగంలోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

ప్రైవేట్‌గా కొనుగోళ్లు..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతీరోజు ఎక్కువ సంఖ్యలో ఆక్సిజన్ సిలిండర్లు అవసరమవుతున్నాయి. దీంతో ప్రైవేట్ సంస్థల వద్ద కొనుగోలు చేస్తూ బిల్లులు చెల్లిస్తున్నారు. అదే ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొస్తే డబ్బులు ఆదా అవుతాయి. కాగా ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

యంత్రాలు తుప్పుపటే అవకాశం..

ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసి యంత్రాలు అమర్చారు. ప్లాంట్ వినియోగించకపోవడంతో యంత్రాలు, పరికరాలు పాడయ్యే అవకాశం ఉంది. కాగా ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

వినియోగంలోకి తీసుకువస్తాం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. ప్లాంట్ ఏర్పాటు చేసిన తర్వాత కొన్ని సాంకేతిక కారణాల వల్ల నిలిపివేశాం. మరమ్మతుల విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే వినియోగంలోకి తీసుకుస్తాం.
– బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్

ప్రమాదానికి కారణమైన వారిని శిక్షించాలి

- మానుకోటలో మృతుల బంధువులు, కుటుంబీకుల రాస్తారోకో



ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు, తండావాసులు



పోలీసులతో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీలోని జమాండ్లపల్లి అటవీ శాఖ అర్బన్ పార్కు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అండర్ బ్రిడ్జి రహదారిపై మృతుల బంధువులు, తండా వాసుల సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు రాము, కృష్ణ, చిన్న ఎల్లాపూర్ సర్పంచ్ బాలునాయక్ మాట్లాడుతూ.. మద్యం తాగి అతి వేగంతో కారును నడిపి ఆటోను ఢీకొట్టి నలుగురి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. పోలీసులు కేసును పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తూ మృతదేహాలతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు ఆందోళనకారులు వెళ్లే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు అడ్డుకున్నారు.డీఎస్పీ సత్యనారాయణ ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకొని ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కాగా ఆందోళన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్, గూడూరు, బయ్యారం సీఐలు రమేష్, ఫణిదర్, బాబురావు, ఎస్సైలు దీపికరెడ్డి, రామారావు, శివ, జీనత్ కుమార్, శ్యాంసుందర్, రాణాప్రతాప్, పోలీసు సిబ్బంది భారీ సంఖ్యలో మోహరించారు.

పరామర్శ..

మృతుల కుటుంబ సభ్యులు, బంధువులను ఎంపీ కవిత,ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పరామర్శించి ఓదార్చారు. అలాగే ప్రమాద సమయంలో ప్రత్యక్షంగా తాను అక్కడే ఉండి క్షతగాత్రులను ఆస్పత్రికి పంపించానని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి పరిహారం అందించేలా కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి పరామర్శించి రూ.10వేల నగదు అందజేశారు.

ఆ అధికారులదే ఇష్టారాజ్యం

ఒకే పోస్టులో ఏళ్ల తరబడి పాతుకుపోయారు

- టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో శాసిస్తున్న అధికారులు
- ఇన్నాళ్లూ పట్టించుకోని యాజమాన్యం
- కొత్త సీఎండీ రాకతోనైనా మార్పు వచ్చేనా..?



హన్మకొండ : తెలంగాణస్టేట్ నార్తర్న్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్పీడీసీఎల్)లో కొంత మంది అధికారులు ఏళ్ల తరబడి ఒకే పోస్టులో కొనసాగుతూ తమదే ఇష్టారాజ్యం అన్నట్లు వ్యవహరిస్తున్నారనే చర్చ కంపెనీ ఉద్యోగుల్లో బాహాటంగానే జరుగుతోంది. కొంత మంది జనరల్ మేనేజర్ స్థాయి అధికారులు 10 ఏళ్లకు పైగా ఒకే పోస్టులో కొనసాగుతూ.. తాము ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రెండేళ్లకు ఒక సారి బదిలీ చేయాల్సి ఉన్నా.. పది సంవత్సరాలకు పైబడి ఒకే పోస్టులో పని చేస్తున్నారంటే వారు యాజమాన్యాన్ని ఎంత ప్రభావితం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల బాధ్యులు పేర్కొంటున్నారు. ఒకరిద్దరైతే 15 సంవత్సరాలుగా.. మరికొందరు అధికారులు ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఒకే విభాగంలో విధులు నిర్వహిస్తున్నారని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ప్రధానంగా హెచ్‌ఆర్‌డీ విభాగంలో ముగ్గురు జనరల్ మేనేజర్లు ఉంటారు. ఇందులో ఐఆర్ సెక్షన్‌కు చెందిన జనరల్ మేనేజర్ పరిధిలో ఇండస్ట్రియల్ రిలేషన్స్, మెడికల్, రిక్రూట్‌మెంట్, కారుణ్య నియామకాలు, పెన్షన్ మంజూరు అంశాలు ఉంటాయి. లీగల్ సెక్షన్ జనరల్ మేనేజర్ పరిధిలో కంపెనీకి సంబంధించిన న్యాయపరమైన అంశాలుంటాయి. సర్వీసెస్ జనరల్ మేనేజర్ పరిధిలో పదోన్నతులు, బదిలీలు ఉంటాయి. హెచ్‌ఆర్‌డీతో పాటు ఆపరేషన్, ప్రాజెక్ట్స్, ఫైనాన్స్, పర్చేజ్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఎంఆర్‌టీ, కమర్షియల్, ఐపీసీ అండ్ ఆర్ఏసీ విభాగాలుంటాయి. ఈ విభాగాల్లోనూ కొందరు అధికారులు నిర్ణీత కాలం మించి పని చేస్తున్నారని తెలిసింది. ఏళ్లుగా పని చేస్తూ కంపెనీని శాసించే స్థాయికి వెళ్లినా గతంలో యాజమాన్యం పట్టించుకోలేదని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. గత సీఎండీలు, డైరెక్టర్లు వారిని ట్రాన్స్‌ఫర్ చేయకుండా ప్రాధాన్యత ఇవ్వడంతో కింది స్థాయి ఉద్యోగులు తమకు ఎక్కడ ఇబ్బందులు వస్తాయోననే భయాందోళనతో కిమ్మనకుండా ఉన్నారు. అదే స్థాయి అధికారుల్లోనూ నిరసన వ్యక్తమవుతోంది.

బదిలీలతోనే పరిణతి వస్తుంది: ఉద్యోగ సంఘాల నేతలు

బదిలీలతో అడ్మినిస్ట్రేషన్‌లో పారదర్శకత నెలకొంటుందని, ఒకే పోస్టులో ఒకే అధికారి ఏళ్ల తరబడి పని చేస్తే అక్రమాలు, అవకతవకలకు ఆస్కారమేర్పడుతుందని, అవి బయటపడే అవకాశం తక్కువగా ఉంటుందని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. బదిలీలతో వివిధ విభాగాలు, సెక్షన్లు, అంశాలపై అవగాహన ఏర్పడుతుందని, ఉద్యోగులు పరిణతి చెందుతారని, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ప్రధానంగా హెచ్‌ఆర్‌డీలో ఇలాంటివి ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ఉద్యోగుల నియామకాలు, సర్వీస్‌కు సంబంధించిన అంశాలను చూసుకునే విభాగం కావడంతో ఎక్కడ తమకు మెలిక పెడతారనే భయంతో ఉద్యోగులు మిన్నకుండిపోయారు. ప్రభుత్వం ఐఏఎస్ అధికారిని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించడంతో లాంగ్ స్టాండింగ్ అధికారుల అంశం తెర మీదికి వచ్చింది. ఏళ్ల తరబడి పాతుకు పోయిన అధికారులపై చర్యలు తీసుకుని స్థాన చలనం కల్పిస్తారని ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పెద్దవంగర: పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలు గ్రామాల ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు పార్టీ గెలుపుకోసం సైనికుల్లా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కాంగ్రెస్ కార్యకర్తలు అండగా నిలవాలని, ప్రతిపక్షాలు చేసే విమర్శలకు దీటుగా బదులివ్వాలని చెప్పారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని, మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రతీ గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలు తీరుస్తాని, ఎస్సారెస్పీ జలాలతో ప్రతి చెరువును నింపి సాగుకు నీరు అందిస్తామన్నారు. అనంతరం ఆమెను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సీనియర్ నాయకులు జాటోతు నెహ్రూనాయక్, నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు, దుంపల కుమారస్వామి, ముత్యాల పూర్ణచందర్, తోటకూర శ్రీనివాస్, రంగు మురళీగౌడ్, యూత్ అధ్యక్షుడు బీసు హరికృష్ణ తదితరులు ఉన్నారు.

కనుల పండువగా మల్లన్న కల్యాణం



స్వామికి బోనాలు సమర్పిస్తున్న గ్రామస్తులు



మల్లికార్జునస్వామి కల్యాణం జరుపుతున్న దృశ్యం

గూడూరు: మండలంలోని మచ్చర్ల శివారు దేవుని గుట్టపై మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం కనుల పండువగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పార్లుదండాలు, పెద్దపట్నం, బోనాలు, ఒగ్గుకథలతో భక్తులను అలరించారు. ఉదయం పెద్ద పట్నం వేసి కల్యాణ వేడుకలను అత్యంత వైభవంగా జరిపించారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించుకున్నారు. సంతానం కలగాలని మహిళలు పార్లుదండాలతో వరంపట్టి వేడుకున్నారు. మచ్చర్ల మల్లన్నా.. సల్లంగ చూడన్నా అంటూ స్వామిని వేడుకున్నారు. జాతరకు మండలంలోని పలు గ్రామాల యాదవ కులస్తులు కుటుంబ సమేతంగా చేరుకొగా, మండల ప్రజలు పద్ద పట్నం, కల్యాణానికి హాజరై స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జాతర నిర్వాహకులు, మచ్చర్ల యాదవ సంఘం పెద్దగొల్ల కాడబోయిన నర్సయ్య, సారగొల్ల గజ్జి నర్సయ్య, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన శ్రీలత, మల్లేష్‌యాదవ్, గ్రామ పెద్దలు ఉన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

నెహ్రూసెంటర్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్థ ఉద్యోగులందరూ కష్టపడి పని చేయాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతీ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వసూలు చేయడంపై శ్రద్ధ వహించాలన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని 38 శాతం ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ మీటర్లు బిగించాలని, తద్వారా ప్రభుత్వం అందించనున్న 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకం అందుతుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల నుంచి కులం సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు 6 నెలల లోపు మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగం, రెవెన్యూ, ప్రమాదాలు, ఇతర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యుత్ శాఖ డైరెక్టర్లు సంధ్యారాణి, మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సీజీఎం అశోక్, మానుకోట ఎస్ఈ జె.నరేష్, డీఈలు విజయ్, మధుసూదన్, సునీతాదేవి, ఏడీలు, ఏఈలు, అకౌంట్స్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళను వేధించిన వ్యక్తికి దేహశుద్ధి

కొత్తగూడ : మహిళను లైంగికంగా వేధించిన వ్యక్తికి ఆమె తరఫు బంధువులు దేహశుద్ధి చేసిన సంఘటన మండలంలోని వేలుబెల్లి గ్రామంలో సోమవారం జరిగింది. వేలుబెల్లి గ్రామానికి చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగికంగా వేధించే వాడు.ఈ విషయాన్ని గ్రామపెద్దలకు తెలిపి హెచ్చరించినా అతను పద్ధతి మార్చుకోలేదు. దీంతో విషయాన్ని బాధిత మహిళ తన కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపింది. ఆగ్రహానికి గురైన బంధువులు సోమవారం రాత్రి సదరు వ్యక్తి పై దాడికి దిగారు. ఈఘటనలో అతని తలకు తీవ్ర గాయమైంది. వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై నగేష్‌ను వివరణ కోరగా మహిళ నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మచిలీబజార్‌కు చేరిన క్రాంతికుమార్ మృతదేహం


క్రాంతికుమార్(ఫైల్)

హన్మకొండ చౌరస్తా: ఉద్యోగ రీత్యా పోలాండ్ దేశంలో స్థిరపడిన హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన రావుల క్రాంతికుమార్(39) గతేడాది(డిసెంబర్ 26)న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. కాగా క్రాంతికుమార్ మృతదేహం సోమవారం మచిలీబజార్‌లోని సొంత ఇంటికి చేరుకుంది. 21రోజుల తర్వాత మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం పద్మాక్షికాలనీలోని హిందూ శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేశారు. మృతుడి తండ్రి మాజీ కార్పొరేటర్ రావుల సుదర్శన్‌ను పలువురు పరామర్శించి, సంతాపం తెలిపారు.

గాలిపటం మాంజాతో పలువురికి గాయాలు

దేశాయిపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా యువకులు ఎగురవేస్తున్న పతంగిలకు ఉపయోగిస్తున్న మాంజా వాహనదారులను గాయపర్చడమే కాకుండా ప్రాణాంతకంగా తయారైంది. సోమవారం వరంగల్ పోచమ్మ మైదానం సూర్యాబార్ ప్రాంతంలో పతంగులు ఎగురవేస్తున్నారు. కైట్ల పోటీలో ఒక పతంగి తెగిపోయింది. దానికి ఉన్న మాంజాదారంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు అమ్మాయిలకు గాయాలయ్యాయి. వీరి వెనక మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువతి గొంతుకు మాంజాదారం తగిలి కోసుకుపోవడంతో తీవ్రం గాయమైంది. క్షతగాత్రులను స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు వాట్సాప్‌లో వైరల్ అయ్యింది. ఈ విషయంపై ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ పోలీసులను విచారించగా అలాంటి ఘటన మా దృష్టికి రాలేదని, ఫిర్యాదులు కూడా రాలేదని చెప్పారు.

పెద్దమ్మ గుడిలో చోరీ

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఈ మేరకు ఆలయంలోని బీరువాలో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు అమ్మవారి మెడలోని మూడు తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎల్కతుర్తి: కొత్తపల్లి నుంచి కొత్తకొండకు బయలు దేరిన ఎడ్లబండ్ల రథాలు, జాతరలో ప్రత్యేక ఆకర్షణగా మేకల బండి





ఐనవోలు : జాతరలో పర్యవేక్షిస్తున్న అధికారులు




పాలకుర్తి టౌన్ : జాతరకు బోనం ఎత్తుకుని వస్తున్న ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీ రెడ్డి

తీగబారిన తీర్థాలు..

భక్తులతో కిటకిటలాడిన ఐనవోలు, కొత్తకొండ, ఆలేటి ఎల్లవ్వ జాతరలు
- బోనాలు, పట్నాలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య స్వామివార్ల చెంతకు..

మకర సంక్రాంతి రోజు స్వామి వార్లను దర్శించుకుంటే భోగభాగ్యాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. దీంతో హనుమకొండ జిల్లా ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి వారి ఆలయం, భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం, జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ఆలేటి ఎల్లవ్వ జాతరకు (తీర్థాలు) లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, శివసత్తులు పూనకాల మధ్య స్వామివార్ల చెంతకు చేరుకున్నారు. అనంతరం బోనాలు, పట్నాలతో మొక్కులు తీర్చుకున్నారు. సంతాన సాఫల్యం కోసం కొందరు మహిళలు ఆలయం చుట్టూ తడి బట్టలతో వరం పట్టారు. కోర్కెలు తీరిన భక్తులు కోడెలు కట్టి తనివితీరా మొక్కులు తీర్చుకున్నారు. కాగా, ఆయా జాతరల్లో పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పాలకుర్తి టౌన్ : ఆలేటి ఎల్లవ్వ జాతరకు వచ్చిన భక్తజనం

ఐనవోలు : మల్లన్న.. శరణు శరణు.. మల్లన్న.. మమ్మేలు.. అనే నినాదాలతో ఐనవోలు మల్లన్న క్షేత్రం హోరెత్తింది. జాతర ఉత్సవాల్లో భాగంగా మకర సంక్రాంత్రి పర్వదినాన సోమవారం శివసత్తులు భక్తి పారవశ్యంతో నెత్తిన బోనం ఎత్తుకుని నాట్యం చేస్తూ స్వామివారికి మొక్కులు చెల్లించారు. మకర సంక్రాంతి సందర్భంగా భక్తులు వివిధ వాహనాలు, కాలినడకన అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతర ప్రాంగణంలో బోనాలు అలంకరించి దానిపై దీపం వెలిగించి బోనం ఎదుట పట్నం వేయించి ఒగ్గుపూజారులతో మల్లన్నను స్తుతింపచేశారు. అనంతరం మల్లన్నకు మనసారా మొక్కులు చెల్లించారు. కాగా, స్వామివారికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకర్షణీయంగా మార్నేని వంశస్తుల పెద్దరథం

చీర, సారె, ఒడిబియ్యం, పసుపు (బండారి), కుంకుమలు, పూజాకానుకలు మార్నేని వంశస్తులు తమ కుటుంబ సభ్యుల నుంచి సేకరించి ఒక పెట్టెలో భద్రపరిచారు. అనంతరం పెద్ద పూల(శిడి) రథాన్ని అలంకరించి పూజాకానుకలతో కూడిన పెట్టెను అందులో ఉంచారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఇంటి వద్ద నుంచి శిడి రథం సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి రాత్రి 12.30 గంటలకు ఆలయం తూర్పు ద్వారం వద్దకు చేరుకుంది. తూర్పు ద్వారం వద్ద నుంచి రథంలో వెంట తెచ్చిన పెట్టెను ఆలయంలోకి తీసుకెళ్లి మార్నేని వంశస్తులు వారి మొక్కులను అప్పజెప్పారు. కాగా, రథ నిర్వాహకులు మార్నేని రవీందర్‌రావు, మధుమతి దంపతులను ఉత్తర ద్వారం వద్ద ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు.

వీరభద్రుడి సన్నిధిలో సంక్రాంతి సంబురాలు..

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. సోమవారం సంక్రాంతి బండ్లు తిరుగుట, మంగళవారం నాగవెల్లి, పుష్పయాగ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్.. వీరభద్రస్వామి, భద్రకాళి సమేత స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆకర్షణీయంగా ఎడ్లబండ్ల రథాలు..

కొత్తపల్లికి చెందిన గ్రామస్తులు 75 ఎడ్లబండ్లను రథాలుగా అలంకరించి సోమవారం సాయంత్రం బయలు దేరి రాత్రి సుమారు 12గంటల సమయానికి ఆలయానికి చేరుకున్నారు. కడిపికొండ నుంచి భక్తులు మేకల బండ్లతో జాతరకు తరలివచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. సంక్రాంతి నాగవెల్లి, పుష్పయాగాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆలయ ఈఓ కిషన్‌రావు, ఎంపీపీ జక్కుల అనితారమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, సర్పంచ్ దూడల ప్రమీల, ఎంపీటీసీ యాటపోలు రాజమణి, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజన్న, సదానందం, రాంబాబు, వీరభద్రయ్య, వినయ్‌శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏసీపీ డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు బందోబస్తు నిర్వహించారు.

స్వామివారిని దర్శించుకున్న అధికారులు

సీఎఫ్ఓ సునీత, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్.. వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే, వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, డీపీఓ జగదీష్, సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి, ఏసీపీ డేవిడ్‌రాజ్ తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాజీ మంత్రి ఈటల, ఎమ్మెల్యే కడియం..

కొత్తకొండ వీరభద్రస్వామి వారిని సోమవారం మాజీ మంత్రి ఈటల రాజేందర్ దర్శించుకున్నారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, బీజేపీ నాయకుడు జె.సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ప్రణవ్.. స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలేటి ఎల్లవ్వ జాతరకు పోటెత్తిన భక్తజనం..

పాలకుర్తి టౌన్: సంకాంత్రి పండుగ సందర్భంగా నిర్వహించే ఆలేటి ఎల్లవ్వ జాతర ఘనంగా జరిగింది. సోమవారం జరిగిన జాతరకు పలు గ్రామాల నుంచి మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని తరలివచ్చారు. అనంతరం తాటి చెట్టు వద్ద పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కాగా, ఎల్లవ్వ తల్లికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, సర్పంచ్ నాగభూషణం, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్యదర్శి పులి గణేష్, నాయకులు మాడరాజు యాకయ్య, దార శంకరయ్య, బత్తిని గోపాల్, భైరు భార్గవ్, శివరాత్రి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఎల్కతుర్తి: వీరభద్రస్వామి ఆలయంలో గుమ్మడి కాయతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మంత్రి పొన్నం


ఐనవోలు: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

ఐనవోలు మల్లికార్జున స్వామి వారిని వరంగల్ ఎంపీ దయాకర్ దంపతులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్ రావు దంపతులు, జిల్లా అడిషనల్, ట్రెయినీ కలెక్టర్లు రాధిక గుప్తా, శ్రద్ధాశుక్లా, కనుమరోజు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు-ఎంపీపీ మధుమతి దంపతులు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ నాయకుడు వరద రాజేశ్వర్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.

జల్సాలకు అలవాటుపడి.. చోరీలు

- పలు ఏటీఎంల్లో చోరీకి యత్నం
- నాలుగు గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ వెల్లడి


నర్సంపేట : మాట్లాడుతున్న డీసీపీ రవీందర్


మామునూరు: స్వాధీనం చేసుకున్న ఆటో, దొంగలను చూపుతున్న ఎస్సై కృష్ణవేణి, సిబ్బంది

నర్సంపేట రూరల్ : జల్సాలకు అలవాటుపడి.. నగదు కోసం పలు ఏటీఎంలలో చోరీకి యత్నించి, వాటిని ధ్వంసం చేసిన సంఘటన నర్సంపేట పట్టణంలో చోటు చేసుకుంది. ఈ కేసును నాలుగు గంటల్లో స్థానిక పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేయడం అభినందనీయమని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. నర్సంపేట పోలీస్ స్టేషన్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేటకు చెందిన మేడిద వంశీ జల్సాలకు అలవాటుపడి.. అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని పట్టణంలోని ఐదు ఏటీఎంలలో చోరీకి యత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో వాటి డిస్‌ప్లే, అద్దాలు పగలగొట్టి ధ్వంసం చేశాడు. దీంతో రూ.4.5లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని, పోలీసులు ఘటన స్థలానికి పరిశీలించి, సీసీ కెమెరాల ఆధారంగా నాలుగు గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడు వంశీని అరెస్టు చేసినట్లు తెలిపారు. త్వరగా కేసును ఛేదించిన నర్సంపేట ఏసీపీ తిరుమల్, సీఐ రవికుమార్, ఎస్సై రవి, కానిస్టేబుల్‌ను అభినందించి రివార్డులు అందించారు. యువత సన్మార్గంలో నడవాలని, మద్యం, గంజాయికి బానిస కావొద్దని సూచించారు. ఎవరైనా అక్రమంగా గంజాయి రవాణా చేస్తే సమాచారం అందించాలని సూచించారు. భూ కబ్జాలు, ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల కబ్జాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ రవీందర్ హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ, టౌన్ సీఐ రవికుమార్, ఎస్సై రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్ట్
నగదు, ఆభరణాలు, ఆటో స్వాధీనం

మామునూరు : పట్టపగలు ఇంట్లో చోరీ చేసి ఆటోలో యథేచ్ఛగా తిరుగుతున్న అంతర్‌రాష్ట్ర దొంగలు పట్టుపడ్డారు. మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని నాయుడు పెట్రోల్ పంప్ వద్ద సోమవారం ఎస్సై కృష్ణవేణి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కాగా, ఆటోలోని ఓ యువకుడు పారిపోగా అనుమానస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. ఈ నెల 5వ తేదీన సెంట్రల్ జైలు నుంచి విడుదలైన దొంగలు వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఎలుకుర్తికి చెందిన గోసుగొండ రాకేష్(27), హైదరాబాద్ చాంద్రయణ గుట్టకు చెందిన సత్తూరి కుమార్(32), ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన చిలుకూర్ కృష్ణారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్నారు. ఈ ముగ్గురిపై పలు చోరీ కేసులు, పీడీ యాక్ట్ నమోదై ఉన్నాయి. చర్లపల్లి జైలులో ముగ్గురికి ఏర్పడిన పరిచయం కాస్తా స్నేహంగా మారింది.ఈ నెల 5న జైలు నుంచి విడుదలైన వీరు మరుసటిరోజు ఉదయాన్నే ముగ్గురు కలిసి ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన సోల్తి సాంబయ్య, అతడి కుమారుడు అశోక్ ఇంటికి కన్నం వేశారు. తాళం వేసిన ఇంట్లో చోరీ చేసి బీరువాలోని 5 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరించినట్లు పోలీసుల విచారణలో దొంగలు ఒప్పుకున్నారు. జల్సాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించేందుకు వీరు తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ చేసిన సొత్తును ఫైనాన్స్‌లో తాకట్టు పెడుతున్నట్లు గుర్తించారు. అరెస్ట్ చేసిన గోసుగొండ రాకేష్, సత్తూరి కుమార్ నుంచి రూ.11 వేల నగదు, ఒక పట్ట గొలుసు, ఆటో స్వాధీనం చేసుకొని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. చోరీ కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్‌ను, ఎస్సై కృష్ణవేణి, సిబ్బందిని ఏసీపీ సతీష్‌కుమార్ అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

బయ్యారం : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం బయ్యారంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వల్లపు వీరమ్మ(50) భర్త వెంకన్నతో పాటు ఇద్దరు కుమారులతో కలిసి హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు ఇంటికి రాగా కుల చిట్టి డబ్బులు చెల్లించడంపై ఇంట్లో గొడవ జరిగింది. దీంతో భర్త వెంకన్న చిట్టీ డబ్బులు ఇచ్చేందుకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో వీరమ్మ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైల్డ్ వెల్ఫేర్‌కు బాలిక అప్పగింత

వరంగల్ : మానసిక పరిస్థితి సరిగా లేని ఓ బాలికను బెతెస్థా లైఫ్ సెంటర్‌కు అప్పగించినట్లు ఏనుమాముల సీఐ మహేందర్ తెలిపారు. పైడిపల్లి సమీపంలోని అగ్రికల్చర్ కాలేజీ వద్ద సోమవారం బాలిక ఒంటరిగా తిరుగుతోంది. గమనించిన అదే గ్రామానికి చెందిన కోటయ్య, శ్యాంసుందర్ ఆమె వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని మానసిక పరిస్థితి సరిగా లేదని గమనించారు. అనంతరం డయల్-100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా బ్లూకోల్ట్ కానిస్టేబుల్ శ్రీనివాస్.. గ్రామానికి వెళ్లి ఆ బాలికతో మాట్లాడగా వివరాలు చెప్పడం లేదు. ఇదే విషయాన్ని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు తెలియజేశారు. వారి సూచనల మేరకు బాలికను స్తంభంపల్లిలోని బేతేస్థా లైఫ్ సెంటర్‌కు అప్పగించామన్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు ఏనుమాముల సీఐ 87126 85120, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజు 98660 09416, బేతేస్థా లైఫ్ సెంటర్ 75695 85472 నంబర్లలో సమాచారం అందించాలన్నారు.

నల్లబెల్లం, పటిక సీజ్

నెల్లికుదురు : అక్రమంగా నిల్వచేసిన నల్లబెల్లం, పటికను స్వాధీన పర్చుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని బోటిమీది తండా శివారు కొంగులగుట్ట తండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంగులగుట్ట గుట్ట తండాకు చెందిన బానోత్ చిన్న మాలు అక్రమంగా నల్లబెల్లం వ్యాపారం చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందినట్లు తెలిపారు. పోలీసు సిబ్బందితో కలసి చిన్న మాలు ఇంట్లో సోదాలు నిర్వహించగా 20బస్తాల్లో 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4క్వింటాళ్ల పటిక ఉన్నట్లు గుర్తించామన్నారు. తారాసింగ్‌బావి తండాకు చెందిన బానోత్ వినోద్‌కుమార్ సహకారంతో నల్ల బెల్లం తక్కువ ధరకు తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తు వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నల్లబెల్లం, పటికను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

విషాహారం తిని కోళ్లు మృత్యువాత

కొత్తగూడ : విషం కలిపిన ధాన్యం తిని నాటుకోళ్లు మృత్యువాత పడ్డాయి.ఈ ఘటన మండలంలోని చంద్రుతండాలో మంగళవారం జరిగింది. తండా శివారులోని పంట పొలంలో మొక్కజొన్న, వరి ధాన్యంలో విషం కలిపి ఆరబోశారు. వాటిని తి న్న నాటుకోళ్లు, పావురాలు మృత్యువాత పడ్డాయి.

వేర్వేరు ప్రమాదాల్లో ఇరువురి మృతి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేర్వేరు ప్రమాదాల్లో సోమవారం ఇరువురు మృతి చెందారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు, మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని జగ్గుతండాకు చెందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి..


తిరుపతి (ఫైల్)

ఎల్కతుర్తి: తాటి చెట్టుపై నుంచి జారి పడి ఓ గీత కార్మికుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గునిగంటి తిరుపతి (42)గ్రామ సమీపంలోని తాటి చెట్టు ఎక్కి కల్లు దింపుతున్నాడు. ఈ క్రమంలో మోకు జారి చెట్టుపై నుంచి కిందపడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబీకులు హుటాహుటిన ఘటనాస్థలికి బోరున విలపించారు. సంక్రాంతి పండగ పూట కుటుంబంలో విషాదం అలుముకుంది. ఈ ఘటనపై మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి..

బయ్యారం : మూత్ర విసర్జనకు రాత్రి వేళ ఇంటి సమీపంలోని బావి వద్దకు వెళ్లి అందులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని జగ్గుతండాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన ఏడెల్లి సతీష్‌రెడ్డి(36) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పండుగ సందర్భంగా ఇంటి వద్ద ఉన్న సతీష్ తెల్లవారు జామున మూత్రం పోసేందుకు ఇంటి సమీపంలో ఉన్న పెంకుల ఫ్యాక్టరీ బావి వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు బావిలో పడటంతో ఈత రాక నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు


గాయపడిన చంద్రా రెడ్డి, మహేశ్వరి

బచ్చన్నపేట : స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం తేనెటీగలు దాడి చేయగా పలువురు గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన మాడిషెట్టి రాజయ్య, ఇటు కాలపల్లి గ్రామానికి చెందిన దంపతులు బొడిగం చంద్రా రెడ్డి, మహేశ్వరి, కొడవటూర్ గ్రామానికి చెందిన మహేష్, బోనకొల్లూర్ గ్రామానికి చెందిన సందీప్‌కుమార్, బాలరాజు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నారు. కాగా, పోలీస్ స్టేషన్ సమీపంలో తేనెతుట్టె నుంచి ఈగల గుంపు ఒక్కసారి వారిపై పడి కుట్టినట్లు చెప్పారు. కాగా తేనెటీగల దాడిలో మాడిషెట్టి రాజయ్య తీవ్రంగా గాయపడ్డారు. తేనెటీగలు గుంపులుగా ఎగబడి కుడుతుడడంతో వాహనదారులు స్పీడ్‌గా వెళ్లగా కొందరు కేకలు వేశారు. అక్కడ ఏం జరుగుతుందో ఎవ్వరికి కొద్దిసేపు అర్థం కాలేదు.ఈ విషయం ఇలా ఉండగా గాయపడ్డ వారందరూ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా అక్కడ ఒక్కరే సిబ్బంది మాత్రమే ఉండడంతో చేసేది ఏం లేక వారిని జనగామ ఆస్పత్రికి తరలించారు. ఇంత పెద్ద ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క డాక్టర్ కూడా ఉండకపోవడం సిగ్గు చేటని చిన్నరామన్‌చర్ల ఎంపీటీసీ గుర్రాల లలిత, నాయకులు బొడిగం గోవర్ధన్‌రెడ్డి, నర్సిరెడ్డి, బోడకుంటి మల్లయ్య ఆరోపించారు.


ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీ

పూరిల్లు దగ్ధం

- కాలిపోయిన రూ.లక్ష నగదు, ఇతర సామగ్రి

తొర్రూరు రూరల్ : అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని నాంచారిమడూరులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు.. నాంచారిమడూరు గ్రామానికి చెందిన సంపంగి నగేష్ కుటుంబంతోపాటు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా ఇటీవల నాంచారిమడూరుకు వచ్చి తన కుమార్తె మమత వివాహాన్ని నిశ్చయించారు. నగేష్ తన భార్య పేరుతో మహిళా సంఘంలో రూ.లక్ష, బ్యాంక్‌లో కొంత రుణం తీసుకోని, పెళ్లికి కావాల్సిన ఇతర సామగ్రితో పాటు నగదును ఇంట్లో దాచి పెట్టాడు. మరికొంత డబ్బుల కోసం ఇంటికి తాళం వేసి ఆదివారం సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. అదే రాత్రి అగ్నికి గురై పూరిల్లు మంటల్లో కాలిపోతుండగా స్థానికులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులో రాలేదు. అప్పటికే పూరిళ్లుతోపాటు నగదు, ఇతర సామగ్రి అంతా కాలిబూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న నగేష్ సోమవారం వచ్చి చూసేసరికి ఇళ్లంతా మంటల్లో కాలిపోవడంతో కన్నీరుమున్నీరుగా రోదించాడు. కాగా ప్రమాదవశాత్తు కాలిపోయిందా, లేక ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారో అనే అనుమానంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు.


కాలిపోయిన పూరిళ్లు